క్లుప్తంగా

బసవేశ్వరునికి ఘన నివాళులు



బసవేశ్వరునికి నివాళులర్పిస్తున్న ఆర్‌డీఓ మహిపాల్ ఇతర ఉద్యోగులు

నర్సాపూర్: మహాత్మా బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకుని ఆర్‌డీఓ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. బసవేశ్వరుని చిత్ర పటానికి ఆర్‌డీఓ మహిపాల్, డీఏఓ సహదేవ్‌లతో పాటు సిబ్బంది పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ బసవేశ్వరుని సేవలను కొనియాడారు. అలాగే నర్సాపూర్ పట్టణంలోని మహాత్మా బసవేశ్వరుని విగ్రహానికి వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

ఇల్లు లేనివారికి ప్రాధాన్యం

ఎంపీడీఓ శ్రీనివాస్



కౌడిపల్లి: వెంకట్రావ్‌పేటలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో మొదట ఇల్లులేని వారికి ప్రాధాన్యం ఇస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో లబ్ధిదారుల ఎంపికపై ఆరా తీశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కలిముల్ల, పంచాయతీ కార్యదర్శి ఇట్యానాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగికి వీడ్కోలు



అయూబ్ అలీ దంపతులను సన్మానిస్తున్న కోర్టు సిబ్బంది, న్యాయవాదులు.

నర్సాపూర్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అయూబ్ అలీ బుధవారం పదవీ విరమణ పొందడంతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కోర్టు సూపరింటెండెంట్ జమీల్ హమద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాదులు అయూబ్ అలీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు.

సిద్ధయ్య సేవలు మరువలేనివి



సిద్ధయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్): పీఏసీఎస్ సీఈఓ సిద్ధయ్య పదవీ విరమణ పొందారు. వీడ్కోలు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 37 ఏళ్ళ పదవీ కాలంలో రైతులకు చేసిన సేవలను సిబ్బంది, పాలకవర్గం సభ్యులు కొనియాడారు. రైతుల సంక్షేమానికి పాటుపడిన సిద్ధయ్య తన శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి, పాలకవర్గం సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే : ఎంపీడీఓ



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కొల్చారం(నర్సాపూర్): మండలానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నిజమైన అర్హులను గుర్తించేందుకు గ్రామాల్లో పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఫీక్ ఉన్నిసా తెలిపారు.మండలానికి మొత్తం 317 ఇళ్ల మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల ద్వారా అందిన జాబితా మేరకు మొదటి విడత గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రంగంపేట సర్వేలో మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన సర్కారీ స్కూళ్లు

పదో తరగతి ఫలితాల్లో మెరిసిన పేదింటి కుసుమాలు

పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ, మోడల్, కస్తూర్బా పాఠశాలలు తమ సత్తా చాటాయి. అనేక పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పోటీపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేదింటి పిల్లలు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



అర్షియ జబీన్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మోడల్ పాఠశాల వంద ఉత్తీర్ణత సాధించి తన ప్రత్యేకతను చాటుకుంది. అలాగే మండలంలోని సూరారం జెడ్పీ పాఠశాలలో వందశాతం, శాలిపేట, మడూర్, ధరిపల్లి జెడ్పీపాఠశాలలు, కేజీబీవీ 99 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే.. నార్సింగి జెడ్పీ పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించగా, శేరిపల్లి జెడ్పీపాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మడూర్ విద్యార్థిని రాజేశ్వరీ(570), మోడల్‌స్కూల్ విద్యార్థిని కావేరి(568) వైష్ణవి(567), శాలిపేట జెడ్పీపాఠశాల మేనక(551), మిర్జాపల్లి జెడ్పీపాఠశాల స్నేహ(549), ధరిపల్లి జెడ్పీపాఠశాల వైష్ణవి(536), కేజీబీవి శంకరంపేట విద్యార్థినిలు మానస, రేవతి(530) మార్కులు సాధించారు. నార్సింగి జెడ్పీపాఠశాలకు చెందిన అర్షియ జబీన్(554) మండల టాపర్‌గా నిలిచింది.

ఆరు పాఠశాలలో వందశాతం ఫలితాలు



రాజేశ్వరీ

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలంలోని పదో తరగతి ఫలితాలలో విద్యార్థులు సత్తా చాటారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మూడు గురుకులాలు ఉండగా.. ఎంజేపీ కౌడిపల్లి, తునికి, కౌడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలతోపాటు కన్నారం, కంచన్‌పల్లి, సలాబత్‌పూర్ ఉన్నత పాఠశాలలో వందశాతం ఫలితాలు సాధించారు. మండల టాపర్‌గా వెల్మకన్న ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాజేశ్వరీ 576, తునికి ఎంజేపీ విద్యార్థి అఖిలేష్ 564మార్కులతో ద్వితీయ, కౌడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆఫ్షా562 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

నిజాంపేటలో 99.38శాతం ఉత్తీర్ణత

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని పదవ తరగతి విద్యార్థులలో 99.38శాతం ఉత్తీర్ణత సాధించారు. మండంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలో ఆరింట్లో వంద ఉత్తీర్ణత సాధించారు. కల్వకుంట పాఠశాలలో ఒక విద్యార్థి గైర్హాజరు కావడంతో 99.22 శాతం సాధించింది. మండల టాపర్‌గా కల్వకుంట గౌరి మానస 560, మలోత్ ఐశ్వర్య 559 ద్వితీయ స్థానం సాధించారు.



గౌరి మానస

97 శాతం ఉత్తీర్ణత

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వెంకటేశం తెలిపారు. చీలాపల్లి, ముసాపేట, కస్తూర్బా, మోడల్‌స్కూల్‌లో 100 శాతం, జెడ్పీబాలికల, జెడ్పీహెచ్‌ఎస్‌లో 95 శాతం, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 93 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండల టాపర్‌గా బూత్కూరి లాస్య(576) నిలిచింది.



బూత్కూరి లాస్య

వెల్దుర్తిలో 99 శాతం



భావన



అంజన్‌కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): పదవ తరగతి వార్షిక ఫలితాల్లో వెల్దుర్తి ఉమ్మడి మండల వ్యాప్తంగా 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. మాసాయిపేట మండలంలో 55 మంది విద్యార్థులకు 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, వెల్దుర్తి మండలంలో 453 మంది విద్యార్థులకు 444 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వెల్దుర్తి మండలంలో గుంటుకు భావన 564, మాసాయిపేట మండలంలో అంజన్‌కుమార్ 559 మార్కులతో ఆయా మండలాల్లో మండల టాపర్‌లుగా నిలిచారు.

మనోహరాబాద్‌లో 98 శాతం

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలంలో ఒక కస్తూర్బా, ఏడు ఉన్నత పాఠశాలలో 98 శాతం ఫలితాలు వచ్చాయి. ఇందులో కూచారం, కస్తూర్బా, రామయపల్లి, ముప్పిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కూచారం ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిత 545 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.



హర్షిత

చిలప్‌చెడ్‌లో 98.14 శాతం

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో పదవ తరగతిలో ఉత్తీర్ణత 98.14 శాతం సాధించారని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్, చండూర్, సోమక్కపేట్, గౌతా పూర్, చిట్కుల్ ఉన్నత పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని తెలిపారు. గౌతాపూర్ పాఠశాల విద్యార్థిని ఇండ్ల హరిణి అత్యధికంగా 569 మార్కులు సాధించి మండల టాపర్‌గా ఉండగా, ఫైజాబాద్ పాఠశాల విద్యార్థి రామస్వామి హారిక 558 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు.



హరిణి

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

టేక్మాల్(మెదక్): పదోతరగతి ఉత్తీర్ణతలో టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మోడల్ స్కూల్‌కు చెందిన శ్రీజ 577 మార్కులను సాధించి మండల టాపర్ నిలవగా, కార్తీక్ 572 మార్కులతో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ సాయిలు తెలిపారు.మండలంలోని అన్ని పాఠశాలలో కలిపి 99.13శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సుజాత తెలిపారు.



శ్రీజ

నాలుగు స్కూళ్లలో వంద శాతం

మోడల్ పాఠశాల విద్యార్థులు హవా

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో మండల స్థాయిలో టాప్ మార్కులు సాధించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ఎనిమిది మంది విద్యార్థులు మండల స్థాయి టాపర్లుగా నిలిచారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా బాలికల పాఠశాల, తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. శ్రీనిధి 570 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అలాగే.. ఎం కార్తీక, 569, చైత్రశ్రీ 569, సహస్రారెడ్డి 569 మార్కులను సాధించి టాపర్లుగా నిలిచారు.



శ్రీనిధి

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలంలోని కోనాపూర్, రాయిలాపూర్, లక్ష్మాపూర్, స్థానిక బాలికల గురుకుల పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. ప్రగతి ధర్మారం జెడ్పీ పాఠశాల విద్యార్థిని ప్రశాంతి 560 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.



ప్రశాంతి

గీతా విద్యార్థుల ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తూప్రాన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తూప్రాన్ గీతా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు బుధవారం పేర్కొన్నారు. పాపి నిషాంత్ 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించగా, చక్రవర్దన్ 585 మార్కులతో రాష్ట్రస్థాయిలో సత్తా చాటినట్లు తెలిపారు. మరో 28 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు చెప్పారు. ఈసందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ ఉష , డైరెక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని 11 పాఠశాలలకుగాను ఎనిమిదింట్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

సత్తా చాటిన ఎంజేపీ విద్యార్థిని

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ ఎంజేపీ విద్యార్థి శ్రీజ 580 మార్కులు సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయనిర్మల, ఏటీపీ సునీత, అధ్యాపకులు అభినందించారు. అలాగే ప్రియాంక 569 మార్కులు సాధించినట్లు తెలిపారు.



శ్రీజ

గురుకుల విద్యార్థి ప్రతిభ

తూప్రాన్: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు 96.13 ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు. గురుకుల పాఠశాలకు చెందిన డి.అభిలాష్ 585, టీ.జేశ్వంత్ 568 మార్కులు సాధించినట్లు తెలిపారు.



డి.అభిలాష్.

ముగ్గురు టాపర్లు

నర్సాపూర్ రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల, చిన్నచింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు వి.నవ్యశ్రీ 571, బి.ఇందు 571, ప్రణశ్విత 570 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు.



ప్రణశ్విత





నవ్యశ్రీ

మండల టాపర్‌గా సంధ్య

పాపన్నపేట(మెదక్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా కొడుపాక ఉన్నత పాఠశాలకు చెందిన మంగలి సంధ్య నిలిచారు. మొత్తం 98.64 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత చెందారు. మండలంలో 11 ఉన్నత పాఠశాలలుండగా, 515 మంది పరీక్షలు రాశారు. ఇందులో 508 మంది ఉత్తీర్ణులయ్యారు. కుర్తివాడ, యూసుఫ్‌పేట, మల్లంపేట, కొడుపాక, కేజీబీవి పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. కొడుపాక ఉన్నత పాఠశాలకు చెందిన సంధ్య 561 మార్కులతో టాపర్‌గా నిలిచారు.



సంధ్య



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

వాటర్ ప్యూరీఫైయర్ ఏర్పాటు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని స్టేడియంలో యంగ్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరీఫైయర్‌ను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలోకి వచ్చే క్రీడాకారులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో యంగ్ స్టార్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం యంగ్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, పీడీ మధు, యంగ్ స్టార్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రాగి వనజ, కార్యదర్శి వారణాసి సౌమ్య, కోశాధికారి సుమన, తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్యూరీఫైయర్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

పాపన్నపేట(మెదక్): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఉపాధి హామీ సిబ్బంది బుధవారం పాపన్నపేట ఎంపీడీఓ విష్ణువర్ధన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. జీతాలు లేకుండా సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాము, నాగేందర్, యాదగిరి, సుధాకర్, లక్ష్మణ్, బాలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలి

రామాయంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యం లారీలను వెంట వెంటనే అన్‌లోడ్ చేయించాలని స్థానిక తహసీల్దార్ రజనీకుమారి సూచించారు. ఆమె బుధవారం ప్రగతిధర్మారంలోని వెంకటేశ్వర రైసుమిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు సాధ్యమైనంతమేర తగ్గించాలన్నారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా కేంద్రాల నిర్వాహకులు, రైసుమిల్లర్లు సహకరించాలని సూచించారు.

రేపు భగీరథ నీరు బంద్

నర్సాపూర్: మిషన్ భగీరథ నీరు సరఫరా శుక్రవారం ఉండదని పథకం డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. చెక్రియాల్ నుంచి బోర్పట్ల మధ్య పథకం మెయిన్ పైపులైన్‌కు మరమ్మతులు చేయాల్సి వచ్చినందున నీటి సరఫరాలో అంతరాయం కల్గుతుందన్నారు. గురువారం కొన్ని గ్రామాల్లో నీటి సరఫరా ఉంటుందన్నారు. శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గంతో పాటు గుమ్మడిదల, జిన్నారం మండలాలో నీటి సరఫరా ఉండదని తెలిపారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలే ప్రజల్లో చిరస్థాయిగా గుర్తుంటాయని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. అల్లాదుర్గం స్టేషన్‌లో ఉద్యోగ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్ పాండురాజు దంపతులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజలకు అందించిన సేవలు ప్రజలు ఎప్పటికీ మరవరని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం బలహీనులే వస్తుంటారని వారికి తగిన న్యాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, రేగోడ్ ఎస్‌ఐ పోచయ్య, ఏఎస్‌ఐలు దేవిదాస్, పెంటప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హెడ్ కానిస్టేబుల్ పాండురాజు దంపతులను సన్మానిస్తున్న సీఐ రేణుక

నీలకంఠం సేవలు మరువలేనివి

అదనపు కలెక్టర్ నగేష్

పాపన్నపేట(మెదక్): ఏడు మండలాలకు ఎంఈఓగా పని చేసిన నీలకంఠం సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ నగేష్ కొనియాడారు. బుధవారం ఆయన పదవీ విరమణ సందర్భంగా డీఈఓ రాధా కిషన్, డీఎస్ఓ రాజిరెడ్డితో కలిసి ఎంఈఓను సన్మానించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో ఎలాంటి వినూత్న కార్యక్రమం చేపట్టినా విజయవంతం చేసే పట్టుదల ఆయన సొంతమన్నారు. డీసీఈబి కార్యదర్శిగా ఆయన పరీక్షల నిర్వహణకు చేసిన కృషి అభినందనీయ మన్నారు.



పదవీ విరమణ పొందిన ఎంఈఓ నీలకంఠంను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా బసవ జయంతి

రేగోడ్(మెదక్): మండలంలో మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రేగోడ్, కొండాపూర్, జగిర్యాల, ఆర్.ఇటిక్యాల, వెంకటాపూర్, చౌదర్‌పల్లి, టీ.లింగంపల్లి, గజ్వాడ, సింధోల్ తదితర గ్రామాల్లో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి జెండాలను ఆవిష్కరించారు. రేగోడ్‌లో వాహనంపై బసవేశ్వరుడి చిత్ర పటం ఏర్పాటు చేసి గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. పూజారి మహేశ్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచారు. కార్యక్రమంలో సంగప్ప, చంద్రశేఖర్, శ్రీశైలం, మల్లికార్జున్, సంగమేశ్వర్, సంతోష్ కుమార్, ఆదర్శ్, సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

◆ బసవేశ్వర విగ్రహావిష్కరణ

టేక్మాల్(మెదక్): బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో గ్రామ వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలమాలలు వేసి సమాజాభివృద్ధికి బసవేశ్వరుడు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

◆ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం మండలంలో పర్యటించి వివరాలు సేకరించారు. మండలానికి 382 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. మొదటి ప్రాధాన్యత కింద ఇల్లులేని నిరుపేదలను గుర్తించి వారికి సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి మంజూరు చేస్తామని చెప్పారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధరిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకటేశం, కుమ్మరి రాములు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా వారికి రూ.40 వేల సీఎంఆర్‌ఎఫ్ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇద్దిరామ్‌రెడ్డి, ప్రవీణ్, మహేశ్, రాజు, శ్రీకాంత పాల్గొన్నారు.

◆ ప్రమాదవశాత్తు వరి పంట దగ్ధం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రమాదవశాత్తు వరి పంటకు నిప్పంటుకుంది. సుమారు రెండెకరాలు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుపాకి వీరేశం రెండెకరాల్లో వరిసాగు చేశాడు. పంట చేతికి వచ్చే సమయానికి సాగు నీరు అందకపోవడంతో పంటను అలాగే వదిలేశాడు. దీంతో వరి పూర్తిగా ఎండిపోయింది. ఎండిన పంటకు నిప్పంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా వారు ఘటన స్థలికి వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే పంటతో పాటు, పొలంలో ఉన్న బోరు వైర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి.

◆ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యానికి గురైన పేదలకు సీఎంఆర్ కింద మంజూరైన చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంత్రి దామోదర రాజనర్సింహ పార్టీలు చూడకుండా ప్రతీ ఒక్కరికి సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాశ్‌రావ్, బాలకిషన్, బేతయ్య, జైపాల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం(మెదక్):రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లయ్య సూచించారు. అల్లాదుర్గం, సీతానగర్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు సుభాశ్‌రావ్, సీసీ సతీశ్, బేతయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ రేగోడ్ మీదుగా పటాన్‌చెరుకు బస్సు

రేగోడ్(మెదక్): ఖేడ్ నుంచి రేగోడ్ మీదుగా పటాన్‌చెరు వరకు మళ్లీ బస్సు సర్వీసు పునరుద్ధరించారు. బుధవారం మండలంలోని మర్పల్లి వద్ద ఎస్‌ఐ పోచయ్య బస్సు సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఖేడ్ ఆర్టీసీ డిపో అధికారులు సర్వీసును నడపటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ భద్రారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు పాల్గొన్నారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని గొడసంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. బుధవారం రోహిణి నక్షత్ర యుకత మిథున లగ్నంలో యంత్ర ప్రతిష్ఠ, క్షేత్ర పాలకబలి, పూర్ణహుతి వంటి ప్రత్యేక పూజలతో పాటు ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వైభవంగా సాగింది. ధ్వజస్తంభరోహణం, ఎల్లమ్మతల్లి కల్యాణం వేదమంత్రాలతో కన్నుల పండువగా జరిగింది. అనంతరం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264